## లిఫ్ట్ గుంతలో పడి యువకుడి మృతి



యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు లిఫ్ట్ గుంతలో పడి మృతిచెందాడు. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో కొత్తగా నిర్మించిన భవనం లిఫ్ట్ గుంతలో ప్రమాద వశాత్తు మృతి చెందాడు. సత్యనారాయణ అనే ఇంటి యజమాని నిర్మిస్తున్న కొత్త భవనంలో శ్రీరామ్ నగర్‌కు చెందిన నసీమ సుల్తానా కుమారుడు షౌకత్ ఆలీని 2వ తారీఖున మజీదుకు వెళ్ళి వస్తానని తిరిగి రాలేదని సోమవారం లిఫ్ట్ గుంతలో శవమై తేలాడు. ఈమేరకు నసీమ సుల్తానా ఫిర్యాదు చేయగా అనుమాన స్పద మృతిగా బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించడం జరిగిందని బోరబండ ఇన్స్‌పెక్టర్ కామల్ల రవికుమార్ పేర్కొన్నారు.

## నెక్లెస్‌రోడ్‌లో ఆకట్టుకున్న హార్టికల్చర్‌షో



హైదరాబాద్, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన ఆలిండియా ఆర్టికల్చర్, అగ్రికల్చర్‌షో ప్రకృతి ప్రియుల్ని ఆకట్టుకుంటుంది. 14వ మెగా నర్సరీ మేళా లో లేటెస్ట్ ట్రెండింగ్‌లో ఉన్న వర్టికల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టం, టెర్రస్ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్ వంటి లేటెస్ట్ టెక్నాలజీ ఈషోలో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు. దేశవ్యాప్తంగా కోల్‌కతా, ఢిల్లీ, హర్యానా, ముంబాయి, బెంగళూరు ,పూణే, షిర్డీ, కడియం, చెన్నై తెలంగాణ, ఆంధ్ర తదితర నగరాలు, ప్రాంతాల నర్సరీల నుంచి వచ్చిన మొక్కలు ఉత్పత్తులను 150 స్టాల్స్‌లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు.



# హైదరాబాద్ వార్త

# దంచికొట్టిన వాన

### నాలాలో గల్లంతైన మహిళ
### జలమయమైన రోడ్లు
### ట్రాఫిక్ జామ్‌తో నరకయాతన



హైదరాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త : నగరంలో మళ్లీ వర్ష బీభత్సం..సోమవారం భారీ వర్షం పడింది. ఈశాన్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కాస్త అల్పపీడనంగా మారింది. ఈ అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. దీంతో నగరంలోని పలుచోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి. చాలా ప్రాంతాలత్లో రోడ్లపై వర్షం నీరు వేగంగా ప్రవహించింది. భారీ వర్షానికి జన జీవనం పూర్తిగా అస్తవ్యస్తం అయ్యింది. ఈ క్రమంలో గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. హుస్సేన్‌సాగర్ వరద నీటి కాలువలో పడి ఓ మహిళ గల్లంతైంది. తన అమ్మ కనిపించడంలేదని సదరు మహిళ కుమార్తె గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌బిఐ కాలనీ, దామోదరం సంజీవయ్యనగర్‌లో లక్ష్మీ (55) అనే మహిళ ఉంటుంది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురుకి వివాహం అవ్వడంతో ఇంట్లో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఇటీవల వర్షానికి గోడ కూలిపోవడంతో ప్రహరీ లేక లక్ష్మీ ఇబ్బందులు పడుతోంది. అయితే ఆమె కనిపించకుండా పోయింది. ఇంటి వద్ద పగిలిన గాజులు కనిపించడంతో.. నాలాలో పడిపోయినట్లు కుటుంబ సభ్యుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. మ్యాన్‌హోల్ పొంగిపొర్లి మురుగు నీటితో కలిసి దుర్వాసన రావడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్లు చెరువుల్లా మారిపోయాయి. కూకట్‌పల్లి, అల్వీన్‌కాలనీ, హైదర్‌నగర్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, బేగంపేట్, సికింద్రాబాద్, ప్యాట్నీ, పారడైజ్, చిలకలగూడ, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బోరబండ, నారాయణగూడ, హిమాయ్‌నగర్, అబిడ్స్, కోఠి, బేగంబజార్, సుల్తాన్‌బజార్, నాంపల్లి, బషీర్‌బాగ్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, దోమలగూడ, ట్యాంక్‌బండ్, తార్నాక, బోడుప్పల్, నాచారం, హయత్ నగర్, ఎల్బీనగర్, అమీర్‌పేట, చంద్రాయణగుట్ట, పాతబస్తీలోని తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. ఇంటి నుంచి కార్యాలయాలకు, కార్యాల యాల నుంచి ఇంటికి వచ్చే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు తప్పలేదు.

**గంటల కొద్ది రోడ్లపైనే వాహనాలు..** సోమవారం అన్ని కార్యాలయాలు తెరచుకోవడంతో ఒక్కసారిగా వాహనదారులంతా రోడ్లపైకి వచ్చారు. దీనికి తోడు వాన. ఇంకేముంది వాహనాలన్నీ ఉన్న చోటే ఉండిపోయే పరిస్థితి నెలకొంది. కూకట్‌పల్లి నుంచి అమీర్‌పేట, ఖైరతాబాద్ మీదుగా కోఠి వెళ్లే రోడ్‌లో వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. అమీర్‌పేట నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంతో పాటు పంజాగుట్ట నుంచి కొండాపూర్ రోడ్డు, సికింద్రాబాద్ నుంచి జూబ్లీహిల్స్, మాదాపూర్ మీదుగా హైటెక్‌సిటీ వెళ్లే రోడ్డు మొత్తం వాహనాలతో బ్లాక్ అయింది. జేఎన్టీయూ నుంచి హైటెక్‌సిటీ మార్గంలో 5కి.మీ పరిధిలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఒక్కో వెహికిల్ ఇంటికి చేరడానికి కనీసం గంట సమయం పట్టింది. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా..అనూహ్యంగా పెరిగిన వాహనాల రద్దీతో ఏం చేయలేకపోయారు. సాయంత్రం ఆఫీసుల నుంచి బయటకు వచ్చే సమయం కావటంతో ఆందోళన నెలకొంది. భారీ వర్షంతో ఒక్కసారిగా ఐటీతోపాటు ఇతర సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు రోడ్డెక్కితే..ట్రాపిక్ స్థంభించే పరిస్థితి ఏర్పడింది. వర్షం కారణంగా చాలా మంది ఆఫీసుల్లోనే ఉండిపోయారు. వర్షం తగ్గిన తర్వాత ఒక్కసారిగా ఆఫీసుల నుంచి కార్లు, బైక్‌లు బయటకు తీసి రోడ్డెక్కారు. దీంతో నగరంలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతుండటంతో నరకయాతన పడ్డారు. నగరంలో ప్రధానరోడ్లు లింగంపల్లి నుంచి ఖైరతాబాద్, సికింద్రాబాద్ నుంచి హైటెక్ సిటీ వరకు, హబ్సిగూడ-నాచారం, ఉప్పల్-మేడిపల్లి..వరంగల్ జాతీయ రహదారిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 4,ప్రభాతవార్త: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూధన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గం చూపాలని అధికారులకు తెలిపారు. ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని అధికారుల ను ఆదేశించారు. వివిధ మండల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జివో నెంబర్ 58,59 గృహలక్ష్మీ పథకాల గురించి మాట్లాడుతూ వాటి పురోగతిపై ఆరా తీయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఏవో సునీల్, జిల్లా ప్రణాళిక అధికారి సురేందర్, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, తలసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## మధుయాష్కీపై పోస్టర్ హేయమైన చర్య

**మల్‌రెడ్డి రామ్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీకి వ్యతిరేకంగా గాంధీభవన్ వద్ద పోస్టర్ వేయడం హేయమైన చర్య అని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధులు యోగేశ్వర్‌రెడ్డి, సంకేపల్లి సుధీర్‌రెడ్డిలు సోమవారం చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మధు యాష్కీకి వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లను గురించి ఖండించారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరు ఇలాంటి పనులు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహాయాదవ్, జైపాల్‌రెడ్డి, గోవర్దన్, గద్దగూటి స్వామిముదిరాజ్, శ్రీనివాస్, ఫాయాజ్ పాల్గొన్నారు.

**మధుయాష్కీపై గాంధీభవన్ వద్ద పోస్టరు వేయడం సరైన పద్ధతి కాదు**
**జక్కిడి ప్రభాకర్‌రెడ్డి**

కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేయాలని తలపెడితే సహించేది లేదని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిట్టని వారు రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీపై గాంధీభవన్ వద్ద పోస్టరు వేయడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా గత 30 సంవత్సరాలకుపైగా తాను పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గట్టి బందోబస్తు



సమావేశంలో పాల్గొన్న డబీర్‌పుర సిఐ జి.కోటీశ్వరరావు,మైత్రి కమిటి సభ్యులు

యాకుత్‌పుర,సెప్టెంబరు 4 ప్రభాతవార్త : గణేష్ నవరాత్రి ఉత్సవాలు,మిలాద్-ఉన్-నబీ సందర్భంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయనున్నామని డబీర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.కోటీశ్వరరావు అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలను జరుపుకుని తమ సహకారాన్ని పోలీసులు అందించాలని కోరారు. శాంతి మత సామరస్యం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయా లని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి ప్రతి నిధులు,గణేష్ మండపాల నిర్వాహకులు,మిలాద్-ఉన్-నబీ ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## యూట్యూబ్‌లో వీడియోలు చూసి చోరీలు

**చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు**



వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి సందీప్ తదితరులు

గచ్చిబౌలి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త : బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి ఉన్నదంతా పోగొట్టుకున్నాడు. చివరికి స్నేహితుల వద్ద అప్పులు చేసి, అప్పులు తీర్చేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్‌లో వీడియోలు చూసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన యువకుడు చివరికి పోలీసుల చేతికి చిక్కాడు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు సోమవారం గచ్చిబౌలి డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డిసిపి గోన సందీప్ వెల్లడించారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్నకొర్‌పాల్ గ్రామానికి చెందిన మునుగూరు మహిపాల్(27) బ్రతుకుదెరువు కోసం 2014లో నగరానికి వచ్చి అల్లాపూర్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడేందుకు అలవాటుపడిన మహిపాల్ తన వద్ద ఉన్న డబ్బు మొత్తం ఆన్‌లైన్ గేమ్స్‌లో పోగొట్టుకున్నాడు. దీంతో సన్నిహితులు, స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఏప్రిల్ 13వ తేదీన అల్లాపూర్ పరిధిలో సత్యవతి అనే మహిళ మెడలో 3తులాల పుస్తెల తాడును స్నాచింగ్ చేసి పారిపోయాడు. అనంతరం ఆగస్టు 28వ తేదీన మాదాపూర్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో సాయంత్రం వాకింగ్‌కు భార్య,భర్తలు రాగా, వెనుక నుంచి వచ్చిన మహిపాల్ మహిళ మెడలో ఉన్న 4తులాల బంగారు మంగళసూత్రాన్ని తెంచుకొని పరారయ్యాడు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మాదాపూర్ పోలీసులు రెండు చోరీలు ఒకే తరహాలో ఉండడం గమనించి నిందితుడిని వలపన్ని పట్టుకున్నారు. విచారణలో మాదాపూర్ స్నాచింగ్‌తో పాటు అల్లాపూర్ స్నాచింగ్‌కు సైతం పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. ఈమేరకు నిందితుడి వద్ద నుంచి 7తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## కలకలం సృష్టిస్తున్న 'గాంధీభవన్ పోస్టర్లు'

**రోజు రోజుకు వేడెక్కుతున్న ఎల్‌బినగర్‌లో నియోజకవర్గ రాజకీయం**

**గాంధీ భవన్ వద్ద పోస్టర్లు వేయడం బిఆర్‌ఎస్ కుట్రే : మధుయాష్కీ**



ఎల్‌బినగర్ జోన్ ప్రతినిధి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎల్‌బినగర్ నియోజకవర్గంలో రాజకీయ వేడి రాజుకుంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ మరికొద్ది రోజుల్లోనే రానుందన్న ఊహాగానాల నేపథ్యంలో నియోజకవర్గంలో రోజు రోజుకు రాజకీయాలు రంజుగా మారుతున్నాయి. మూడు ప్రధాన పార్టీలు బిఆర్‌ఎస్, కాంగ్రెస్, బిజెపిలు ఎన్నికల రణరంగంలోకి దిగి ఇప్పటికే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. వీటిలో అధికార బిఆర్‌ఎస్ పార్టీ నుంచి అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేరును ఇప్పటికే ఆ పార్టీ అధిష్టానం ప్రకటించగా, కాంగ్రెస్, బిజెపిలు ఆశావహుల జాబితా వడపోతలో తలమునకలై ఉన్నాయి. బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల పేర్లను ఆ పార్టీ అధిష్టానం నేరుగా ప్రకటించగా కాంగ్రెస్, బిజెపిలు మాత్రం ఆశావాహుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించడంతో రెండు పార్టీలలోని ఆశావాహులు తమ అదృష్టాన్ని పరిశీలించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి సుమారు పది మంది ఎమ్మెల్యే టికెట్ తమకే కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. అయితే చివరి నిమిషంలో నిజామాబాద్ మాజీ ఎంపి, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ ఎల్‌బినగర్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నారు. మధుయాష్కీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని అగ్ర నాయకుల్లో ఒకరు కావడం, ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని హయత్‌నగర్ ఆయన స్వగ్రామం కావడంతో ఆయనకే టికెట్ దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎల్‌బినగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ కూడా దరఖాస్తు చేసుకోవడం ఎల్‌బినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ ఆశావహ అభ్యర్థులను ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురిచేసింది. నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో తర్జన భర్జనలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గాంధీ భవన్ వద్ద మధుయాష్కీకి వ్యతిరేకంగా పోస్టర్లు వెలియడం ఎల్‌బినగర్‌లో కలకలం సృష్టించింది. సేవ్ ఎల్‌బినగర్ కాంగ్రెస్.. ప్లీజ్ సే టు నో టికెట్ టు పారాచూట్స్.. గో బ్యాక్ నిజామాబాద్.. అని పోస్టర్లు వెలిసాయి. ఎల్‌బినగర్ కాంగ్రెస్ పేరిట గాంధీ భవన్ వద్ద వెలిసిన ఈ పోస్టర్లు ఎవరు వేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటి వరకు తమకే టికెట్ దక్కుతుందని భావించిన స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆశావాహ అభ్యర్థులే మధుయాష్కీ రాకను జీర్ణించుకోలేక ఆయనకు వ్యతిరేకంగా పోస్టర్లు వేశారా లేక రాజకీయ ఎత్తుగడలో భాగంగా ప్రత్యర్థులు ఎవరైనా వేశారా అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే గాంధీ భవన్ వద్ద పోస్టర్లు వేయడం బిఆర్‌ఎస్ కుట్రేనని మధుయాష్కీ ఆరోపించడంతో ఒక్కసారిగా ఎల్‌బినగర్ రాజకీయం మరింత వేడెక్కింది. పోస్టర్ల గురించి కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విమర్శలు మధుయాష్కీ ఆరోపణలతో బిఆర్‌ఎస్ వైపుకు మళ్లడంతో రాబోయే రోజుల్లో నియోజకవర్గం రాజకీయాలు వాడిగా వేడిగా ఉండడం ఖాయమని చెప్పకనే చెబుతున్నాయి.

## ఐటి కారిడార్ మహిళ హత్య కేసు నిందితుడి అరెస్టు

**హత్య చేసిన వ్యక్తితో పాటు హత్యను దాచిపెట్టిన మరో ఇద్దరి రిమాండ్**



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి జి.సందీప్

గచ్చిబౌలి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త : ఐటి కారిడార్‌లో చోటుచేసుకున్న మహిళ అత్యాచారం, హత్య కేసులో నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. మహిళను హత్య చేసిన నిందితుడితో పాటు హత్య విషయం తెలిసినా, దాన్ని దాచిపెట్టిన మరో ఇద్దరు నిందితులను సైతం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య అనంతరం ముగ్గురు నిందితులు పశ్చిమ బెంగాళ్‌కు పారిపోగా, పోలీసులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం పశ్చిమ బెంగాళ్‌కు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు సోమవారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి గోన సందీప్ వెల్లడించారు. పశ్చిమ బెంగాళ్ రాష్ట్రం మల్దా జిల్లా ఆదాదాంగా గ్రామానికి చెందిన శ్యామల్ రాయ్(27) బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని వాసవి నిర్మాణ సంస్థలో సెంట్రింగ్ కూలీగా పనిచేస్తూ అక్కడే ఉన్న లేబర్ క్యాంపులో నివాసం ఉంటున్నాడు. ఇతనికి గౌలిదొడ్డి కేశవనగర్‌కు చెందిన ఎం.కాశమ్మ(38)తో పరిచయం ఏర్పడింది. కాశమ్మ మొదటి భర్త ఓ హత్య కేసులో జైలుకు వెళ్లగా, కేశవనగర్‌కు చెందిన సాంబయ్యను రెండవ వివాహం చేసుకుంది. తాను కూలిపని చేయగా వచ్చిన డబ్బులు మొత్తం మద్యానికి ఖర్చు చేస్తుండడంతో కుమార్తె లక్ష్మితో కాశమ్మకు గొడవ జరుగగా, గతనెల 27వ తేదీన కాశమ్మ ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేశారు. కాగా ఇంట్లో నుంచి వెళ్లిన కాశమ్మ తనకు పరిచయం ఉన్న శ్యామల్ రాయ్ వద్దకు వెళ్లగా, ఇద్దరు కలిసి విప్రో చౌరస్తా సమీపంలో ఉన్న వాసవి నిర్మాణ సంస్థలో మద్యం సేవించారు. శ్యామల్ రాయ్ మద్యం మత్తులో కాశమ్మ మీద అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం కాశమ్మ చీరతో ఉరివేసి చంపడంతో పాటు పక్కనే ఉన్న రాయిని తలపై మోది దారుణంగా హత్య చేశాడు. హత్య జరిగిన వెంటనే సిసి కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించడంతో పాటు పశ్చిమ బెంగాళ్‌లోని మారుమూల ప్రాంతానికి వెళ్లి నిందితులను అరెస్టు చేసిన గచ్చిబౌలి పోలీసులను సైబరాబాద్ కమీషనర్ అభినందించడంతో పాటు మాదాపూర్ డిసిపి నగదు బహుమతులను అందజేశారు. సమావేశంలో ఏడిసిపి నంద్యాల నర్సింహారెడ్డి, గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ జేమ్స్‌బాబు, డిఐ రాఘవేందర్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది

**మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని**



సనత్‌నగర్‌లోని ఆశోక కాలనీలో శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్,

సికింద్రాబాద్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : పేద ప్రజలు అధికంగా నివసించే బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని మేకలమండిలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ప్రకటించారు. సోమవారం మేకల మండి పాఠశాలలో రూ.1.84 కోట్లతో 16 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను, ఎమ్మెల్సీ నిధులు రూ. 25 లక్షలతో ఏసీడీపీ నిధులు రూ. 7.70 లక్షలతో నూతనంగా నిర్మించిన 3 అదనపు తరగతి గదులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఈ పాఠశాలను 2011 సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలగా ప్రారంభించడం జరిగిందని, 2020 సంవత్సరంలో ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 750 మంది విద్యార్థులు ఉన్నారని, ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. స్పందించిన విద్యాశాఖ మంత్రి వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉన్నత పాఠశాలగా గుర్తింపునిస్తూ 10వ తరగతి వరకు విద్యాబోధన నిర్వహిస్తామని సమావేశంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, టీఎస్‌ఈడబ్ల్యూఐ డీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, హైద్రాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యాధికారి రోహిణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, కార్పొరేటర్ హేమలత, పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్‌లు అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి, పాఠశాల కమిటీ సభ్యు లు ఇ.చంద్రశేఖర్, బత్తుల నర్సింగ్‌రావు, రాజు, శేషగిరి పాల్గొన్నారు.

**సంజీవరెడ్డి నగర్..** పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామి ఇచ్చారు. సోమవారం సనత్‌నగర్‌లోని ఆశోక కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలలో మన బస్తీ మన బడి కార్యక్రమం క్రింద 2.22కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.



